మూగజీవాలకు గడ్డు కాలం

- శీతాకాలంలో మూగజీవాలకు వ్యాధులు సోకే అవకాశం
- గొర్రెలు, మేకల పెంపకం దారులు అప్రమత్తంగా లేకుంటే నష్టం
- ముందస్తు జాగ్రత్తలు పాటించాలని పశు వైద్యుల సూచన



వంగర వద్ద పొలాల్లో మేత మేస్తున్న గొర్రెలు

దత్తిరాజేరు: మూగజీవాలకు శీతాకాలం ఒక గడ్డు కాలం. ఈకాలంలో కొన్ని రకాల వైరస్‌ల వల్ల, ఆరు బయట ఉంచడం వల్లగొర్రెలు, మేకలు ఎక్కువగా వ్యాధు ల బారిన పడుతుంటాయి. సకాలంలో వైద్యం అందించకపోతే చని పోతుంటాయి. జీవాల ఆరోగ్యం విషయంలో పెంపకందారులు అప్రమత్తంగా ఉంటూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. పోషణతో పాటు వాటి సంరక్షణపై దృష్టి సారించాలి. వాతావరణం చల్లగా ఉండడం, మంచు కురవడం వల్ల శరీర స్థితి బాగాలేని గొర్రెలు, మేకలు ఈ కాలంలో తొందరగా వ్యాధుల బారిన పడతాయి. పారుడు, మశూచి, న్యుమోనియా, జీర్ణకోశ సంబంధిత వ్యాధులు, దోమలు, కీటకాల వల్ల తిక్క(సర్వ) రోగం ఎక్కువగా వస్తుంది.

న్యుమోనియా

జీవాలను ఆరుబయట ఉంచడం, పాకలు పరిశుభ్రంగా లేకపోవడం, దుమ్మూధూళితో నిండిఉండడం, పాకల్లో పరిమితికి మించి ఎక్కువ సంఖ్యలో జీవాలను ఉంచడం, సరైన పోషణ లేకపోవడం వల్ల న్యుమోనియా సోకుతుంది. ఈవ్యాధి బారిన పడిన జీవాల్లో దగ్గు, జ్వరం, ముక్కు కారడం ఎక్కువగా కనిపిస్తుంది. సరిగ్గా మేత మేయకపోవడం వల్ల జీవాలు నీరసించిపోతాయి. ఒకటి నుంచి తొమ్మిది నెలల వయస్సున్న గొర్రె, మేకపిల్లలు ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడుతుంటాయి. మరణాలు కూడా ఎక్కువగా సంభవిస్తాయి. వ్యాధి నివారణకు గాలి,వెలుతురు బాగా వచ్చే పాకల్లో జీవాలను ఉంచాలి. వాటికి సులువుగా జీర్ణమయ్యే ఆహారం, శుభ్రమైన తాగునీరు ఇవ్వాలి. పూర్తిగా వ్యాధి నుంచి కోలుకున్నాకే మందలో కలపాలి.

మశూచి/బొబ్బరోగం

ఈవ్యాధి వైరస్ వల్ల ప్రబలుతుంది. వ్యాధి బారిన పడిన మేకలు, గొర్రెల శర్మంపై బొబ్బలు కనిపిస్తాయి. తీవ్రజ్వరం వచ్చి ముక్కు నుంచి నీరు కారుతుంది. శ్వాస సరిగ్గా ఆడక, వేగంగా ఊపిరి పీల్చుతుంటాయి. వ్యాధి బారిన పడిన జీవాలను మంద నుంచి వేరు చేసి చికిత్స అందించాలి. పుండ్లపై వేప నూనె లేదా పశువైద్యులు సూచించిన మందులను పూయాలి.

నీలినాలుక వ్యాధి

ప్రధానంగా ఈ వ్యాధి గొర్రెల్లో కనిపిస్తుంది. చీకటీగల ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. చలికాలంలో చీకటీగలు ఎక్కువగా వృద్ధి చెందుతుం టాయి. గాలి ద్వారా ఒక ప్రదే శం నుంచి మరొక ప్రదేశానికి చేరి వ్యాధిని వ్యాపింపజేస్తాయి. ఈవ్యాధి సోకిన గొర్రెల్లో అధిక జ్వరం, కళ్లు, ముక్కుల నుంచి నీరు కారుతుంది. నోరు, నాలిక వాచి నీలి రంగులోకి మారుతుంది. నోటిలో పుండ్లు ఏర్పడడం వల్ల జీవాలు ఆహారం తీసుకోవడానికి ఇబ్బంది పడతాయి. కాలిగిట్టలు, చర్మం కలిసే దగ్గర వాపు వచ్చి జీవాలు కుంటుతుంటాయి. వ్యాధి ముదిరితే మరణిస్తాయి. చీకటీగలను నివారించడం ద్వారా ఈ వ్యాధిని నిర్మూలించవచ్చు. జీవాలుండే పాకల దగ్గర మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.వ్యాధి బారినపడిన జీవాలను మందనుంచి వేరు చేసి చికిత్స అందించాలి.

గజపతినగరం నియోజకవర్గంలో గొర్రెలు, మేకల సంఖ్య		
మండలం	గొర్రెలు	మేకలు
దత్తిరాజేరు	12,794	9,916
గజపతినగరం	10,369	9,980
బొండపల్లి	11,913	8,823
గంట్యాడ	9,477	8,252

తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు

- గొర్రెలు,మేకలను ఉంచే పాకల్లోకి శీతల గాలి రాకుండా చర్యలు తీసుకోవాలి
- మంచులో, ఆరుబయట ఉంచకూడదు
- సూర్యరశ్మి ఉన్నప్పుడే, గడ్డిపై మంచు ఆరిన తర్వాతే మేతకు విడిచిపెట్టాలి
- ఈతకు వచ్చిన గొర్రెలను శ్రద్ధగా పర్యవేక్షించాలి
- శరీర ఉష్ణ నిర్వహణకు పీచు పదార్థం గల మేతను మేపాలి
- గొర్రెలను, మేకలను కట్టే ప్రదేశాలను తరచూ మారుస్తూ ఉండాలి
- మృతి చెందిన గొర్రెలు,మేకలు తిన్న గడ్డిని, ఆహారాన్ని మిగతా వాటికి వేయకుండా కాల్చి వేయాలి.

తిక్క(సర్వ)రోగం

చలి కాలంలో దోమలు, కీటకాల వల్ల గొర్రెలు, మేకలకు తిక్క(సర్వ) రోగం ఎక్కువగా వస్తుంది. వ్యాధిని త్వరగా గుర్తించక పోతే జీవాలు మృతి చెందే అవకాశం ఎక్కువ. పాకల వద్ద సాయంత్రం పూట వేపాకు దూపం వేయాలి. పాకలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుండాలి.

అశ్రద్ధ చేయవద్దు



చలి కాలంలో సాధారణంగా గొర్రెలు,మేకలకు వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువ. మూగజీవాలను రోజూ పరిశీలిస్తుండాలి. జీవాలు నీరసంగా ఉన్నా, మేత మేయక పోయినా అశ్రద్ధ చేయకుండా వెంటనే పశువైద్య సిబ్బందిని సంప్రదించాలి. సకాలంలో వ్యాధులను గుర్తించి నివారణ చర్యలు చేపట్టకపోతే జీవాలు మృత్యువాత పడతాయి. పశువైద్యుల సూచనల మేరకు మందులు వాడుతూ సంరక్షణ జాగ్రత్తలు పాటించాలి.

– డాక్టర్ చంద్రశేఖర్, పశుసంవర్ధకశాఖ ఏడీ, గజపతినగరం

క్లుప్తంగా

డోలపేటలో వైద్య శిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ పుష్పాంజలి, వైద్య సిబ్బంది

గజపతినగరం: మండలంలోని డోలపేట గ్రామంలో బుధవారం 104 వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య సిబ్బందితో కలిసి మరుపల్లి పీహెచ్ సీ వైద్యాధికారి పుష్పాంజలి 61 మందికి వివిధ వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వైద్య శిబిరా నికి రాలేని వృద్ధులు, గర్భిణుల ఇళ్లకు వెళ్లి వైద్యతనిఖీలు చేశారు.

పోలీస్ స్టేషన్‌లో తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రాఘవులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పోలీస్ స్టేషన్‌లో చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు బుధవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులతో పాటు వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించడంతో పాటు పెండింగ్ కేసులపై ,ఎస్‌ఐ బి.లోకేశ్వరరావును ఆరా తీశారు.స్టేషన్ డ్యూటీలకు సంబంధించి సిబ్బందికి సూచనలు చేసి, సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన వెంట చీపురుపల్లి సీఐ బి.శంకరరావు ఉన్నారు.

ఆయన నేత్రాలు సజీవం



మృతుడు ఆదిబాబు నుంచి కార్నియా సేకరిస్తున్న సిబ్బంది

చీపురుపల్లి: పట్టణంలోని జి.అగ్రహారానికి చెందిన లంకమల్ల ఆదిబాబు(84) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన నేత్రాలను దానం చేసేందుకు కుమారుడు శ్రీనివాసరావు, అల్లుడు బి.వి.గోవిందరాజులు ముందుకు వచ్చారు. ఈ విషయం రెడ్‌క్రాస్ సంస్థకు చెప్పడంతో రెడ్‌క్రాస్ సిబ్బంది జి.అగ్రహారం చేరుకుని మృతుని నుంచి కార్నియా సేకరించారు. కార్నియాను విశాఖపట్నంలోని ఎల్ వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి తరలించనున్నట్లు సిబ్బంది తెలిపారు.

క్షయ నిర్మూలనే లక్ష్యం

- డాక్టర్ అనిల్‌కుమార్



కొట్యాడ గ్రామంలో అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

లక్కవరపుకోట: క్షయ రహిత దేశమే లక్ష్యంగా ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ. అనిల్‌కుమార్ అన్నారు. జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొట్యాడ, తలారి గ్రామాల్లో బుధవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యసదనంలో నేత్రవైద్య శిబిరం



కంటి పరీక్షలు చేయించుకుంటున్న వృద్ధులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): జిల్లా అంధత్వ నివారణ సంస్థ, సద్గురు కృష్ణయాజీ చారిటబల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో గరివిడి–గర్భాం రోడ్డులో ఉన్న సూర్యసదనంలో బుధవారం నేత్రవైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సిబ్బంది 160 మందికి నేత్రపరీక్షలు చేసి, శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని ఎంపిక చేశారు. కృష్ణయాజీ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ వేమకోటి సూర్యనారాయణశర్మ పాల్గొన్నారు.

విద్యార్థిని కొట్టిన ఘటనపై విచారణ

గంట్యాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి తేజను ఉపాధ్యాయుడు బసవరాజు మంగళవారం కొట్టిన ఘటనపై డిప్యూటీ డీఈఓ కె.వి.రమణ బుధవారం విచారణ చేశారు. బాధిత విద్యార్థి తల్లి, ఉపాధ్యాయుల సమక్షంలో బాధిత విద్యార్థిని విచారించారు. విద్యార్థి అల్లరి చేయడం వల్ల అనుకోకుండా ఈ సంఘటన జరిగిందని, నివేదికను డీఈఓకు అందజేస్తామని డిప్యూటీ డీఈఓ తెలిపారు.

22న మాలల సింహగర్జన



సింహగర్జన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాల సంఘాల నాయకులు

చీపురుపల్లి: జిల్లా కేంద్రంలో ఈనెల 22వ తేదీన మాలల సింహగర్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాల సంఘాల నాయకులు కోరారు. సింహగర్జన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును పునఃసమీక్షించుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని గురజాడ కళాభారతి ఆవరణలో 22వ తేదీన మధ్యాహ్నం 2 గంట లకు మాలల సింహగర్జన ప్రారంభమవుతుందని, మాజీ ఎంపీ జి.వి.హర్షకుమార్, మాలమహాసభ జాతీ య అధ్యక్షుడు మల్లెల వెంకటరావు, ఏఐఎం వ్యవస్థాపకులు ఉప్పు లేటి దేవీప్రసాద్, మాల సంఘాల జేఏసీ చైర్మన్ రేంజర్ల రాజేష్ హాజరుకానున్నారని చెప్పారు. జిల్లాలోని మాలలంతా హాజరై విజయ వంతం చేయాలని కోరారు. ఏపీ దళిత మహాసభ అధ్యక్షుడు గంటాన అప్పారావు, మాల ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మిరియాల కృష్ణారావు, సలహాదారుడు నక్క సూరప్పడు, సంఘ నాయకులు టొంపల సంజీవిరావు, బి.సూర్యనారాయణ, రేగిడి రామకృష్ణ, ఎల్.రాంబాబు, పోలీసు, తౌడు, చిట్టిబాబు, ఎం .శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు.. భవితకు మదుపు



అవగాహన కల్పిస్తున్న జేఈ అప్పారావు

శృంగవరపుకోట: ఇంధన పొదుపు మన భవితకు మదుపు అని విద్యుత్‌శాఖ జూనియర్ ఇంజి నీర్ కె.అప్పారావు,అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆర్.రవికుమార్ అన్నారు. జాతీయ ఇంధ న పొదుపు వారోత్సవాల్లో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డ్వాక్రా సంఘాల సభ్యులకు ఇంధన పొదుపుపై బుధవారం అవగాహన కల్పించారు. విద్యుత్ ఆదా కోసం ఎల్‌ఈడీ బల్బులను, తక్కువ బరువు ఉన్న ఇస్త్రీ పెట్టెలను వాడాలని చెప్పారు.ఫ్రిజ్ డోర్‌ను తక్కువసార్లు తెరవాలని, ఫ్రిజ్‌ను వేడి ఉన్న చోట పెట్టకూడదని, ఫ్రిజ్ వెనుక భాగం గోడను తాకకుండా గాలి తగిలేలా ఉండాలన్నారు. ఫ్యాన్లు, ఏసీలు, గీజర్లు, వాషింగ్‌మెషీన్ల వాడకంలో జాగ్రత్తలను సూచించారు.

రేషన్ డీలర్ పోస్టులకు దరఖాస్తులాహ్వానం

కొత్తవలస: మండలంలో కంటకాపల్లి, గొల్లలపాలెం రేషన్ డిపోల డీలర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ బి. నీలకంఠరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.కంటకాపల్లి డీలర్ పోస్టును ఎస్సీ, గొల్లలపాలెం డీలర్ పోస్టును జనరల్‌కు రిజ ర్వేషన్ కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులై, 18 నుంచి 40 ఏళ్ల లోపు వయస్సు ఉండి, ఆయా గ్రామాల్లో శాశ్వత నివాసం ఉంటున్న వారు అర్హులని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులను ఈనెల 23వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా తహసీల్దార్ కార్యాల యంలో అందజేయాలని, మరిన్ని వివరాలకు సీఎస్‌డీటీ రామకృష్ణను సంప్రదించాలని సూచించారు.

చామలాపల్లి డీలర్ పోస్టుకు...

వేపాడ: చామలాపల్లిలో రేషన్ డీలర్ పోస్టు నియామకానికి ఆర్‌డీఓ నోటిఫికేషన్ విడుదల చేశారని సీఎస్‌డీటీ రామకృష్ణ బుధవా రం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు ఇంటర్ ఉత్తీర్ణులై, ఓసీ స్పోర్ట్స్ కోటా ఉన్న వారికి కేటాయించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 23వ తేదీలోగా తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలి



మాట్లాడుతున్నప్రకృతివ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఆనందరావు

వేపాడ: ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరించేందుకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది,ఆరోగ్య ఉప కమిటీ సభ్యులు కృషి చేయాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఆనందరావు కోరారు. ప్రకృతి వ్యవసాయంపై ఆరోగ్య ఉపకమిటీ సభ్యులకు రెండురోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ తరగతులను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడం , హోమ్ సీడ్‌ఫుడ్ ప్రొడక్షన్‌పై ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకుని గ్రామాల్లో డ్వాక్రా సంఘాల సభ్యులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఎంపీడీఓ సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన ఉత్పత్తులను ఆహా రంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. జెడ్పీటీసీ ఎస్.అప్పారావు మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం వల్ల భూములు నిస్సార మవుతున్నాయని, పంట ఉత్పత్తులు విషపూరితమవుతున్నాయన్నారు. రైతులు సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎస్.వెంకటసత్య, శోభ, సరోజిని, రైతు సేవాకేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

వరి కోతలు, నూర్పులు వాయిదా వేసుకోండి



గజపతినగరం: గంగచోళ్లపెంటలో రైతులను అప్రమత్తం చేస్తున్న వ్యవసాయ అధికారులు



దత్తిరాజేరు: పెదమానాపురంలో రైతులకు టార్పాలిన్లు అందచేస్తున్న జేడీ వి.టి.రామారావు

గజపతినగరం: అల్పపీడనం ప్రభావంతో ఈనెల 20వ తేదీ వరకు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరికోతలు, నూర్పులు వాయిదా వేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ జేడీ వి.టి.రామారావు సూచించారు. మండలంలోని గంగచోళ్లపెంట గ్రామంలో బుధవారం ఆయ న పర్యటించి రైతులను అప్రమత్తం చేశా రు. వరి కుప్పలను పరిశీలించి చేను తడవకుండా టార్పాలిన్‌లు కప్పాలని, ఇప్పటికే పంట నూర్పిడి చేసిన వారు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని రైతులకు సూచించారు. రైతుసేవా కేంద్రంలోని వీఏఏను సంప్రదిస్తే గోనె సంచులు ఇస్తారని చెప్పారు. ఆయన వెంట ఏడీఏ కె.మహరాజన్, ఏఓ సీహెచ్.ధనలక్ష్మి, టెక్నికల్ ఏఓ బి.లోకేష్, వ్యవసాయ విస్తరణ అధికారి సతీష్, సర్పంచ్ బోని సంగమయ్య ఉన్నారు.

టార్పాలిన్ల అందజేత

దత్తిరాజేరు: అల్పపీడనం ప్రభావంతో మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి నూర్పులు వాయిదా వేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ వి.టి.రామారావు రైతులకు సూచించారు. పెదమానాపురంలో బుధవారం వరి నూర్పులు చేస్తున్న రైతులకు టార్పాలిన్లు అందజేశారు. నూర్పులు చేసిన రైతులు ధాన్యాన్ని వెంటనే అందుబాటులో ఉన్న మిల్లులకు తరలించాలని చెప్పారు. ఆయన వెంట ఏడీఏ మహరాజన్, ఏఓ అనురాధ ఉన్నారు.

చదువుతో పాటు యోగా

- ఎంఈఓ విమలమ్మ



పాఠశాలలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంఈఓ విమలమ్మ

గజపతినగరం: సర్కారు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు యోగాపై కూడా దృష్టి సారించాలని ఎంఈఓ విమలమ్మ అన్నారు. గజపతినగరం ఎస్సీ కాలనీలో గల పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రీడలు, యోగా, తదితర అంశాల్లో కూడా రాణించాలని సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

పాఠశాలలో తనిఖీలు

వేపాడ: మండలంలోని వావిలపాడు ప్రాథమిక పాఠశాలలోఎంఈఓ బాలభాస్కరరావు బుధవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. తరగతి గదులు, ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్, టీఎల్‌ఎం, రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం మధ్యా హ్న భోజన వంటకాలను రుచి చూసి, రోజూ మెనూ ప్రకారం వంటలు చేయాలని, నాణ్యత, శుభ్రత పాటించాలని వంట నిర్వాహకులకు సూచించారు. హెచ్‌ఎం జి.లక్ష్మి, సీఆర్పీలు ఆయన వెంట ఉన్నారు.

బడికి దూరమైన చిన్నారులను గుర్తించండి

- ఎంపీడీఓ భాస్కరరావు



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ భాస్కరరావు

మెరకముడిదాం: బడి బయట ఉన్న చిన్నారులను గుర్తించాలని ఎంపీడీఓ జి. భాస్కరరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిశోరీ వికాసంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవితంలో ఎలా ఎదగాలి అన్న విషయమై బాలికలకు అవగాహన కల్పించాలని సూచించారు. చీపురుపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ ఎం. రాజేశ్వరి మాట్లాడుతూ.. కౌమారదశ పథకాలు, కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలను బాలికలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తాడ్డి శ్రీదేవి, నాగమణి, జె.లక్ష్మి, మంగ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

- ఎంపీపీ చల్లా చలంనాయుడు



మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: గ్రామాల సమాగ్రాభివృద్ధే లక్ష్యంగా సర్పంచ్‌లు, అధికారులు సమష్టిగా పని చేయాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో రెండు రోజుల పాటు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపరచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులపై దృష్టి సారించాలన్నారు. జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.గిరిబాల, ఈఓపీఆర్‌డీ ఎ.రఘుపతిరావు, ఎంపీడీఓ కార్యాలయం ఏఓ కె.తులసీరాం, తదితరులు పాల్గొన్నారు.

● సర్పంచ్‌ల వినతి



గ్రామాల్లో పంచాయతీల తీర్మానం లేకుండా ఉపాధి హామీ నిధులతో పనులు చేపట్టడం సరికాదని దత్తిరాజేరు మండలంలోని సర్పంచ్‌లు అన్నారు. ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్‌ను టి.భూర్జవలస, భూపాలరా జపురం, వింధ్యావాసి సర్పంచ్‌లు మంత్రి క్రాంతికుమార్, గురునాయుడు,శేఖర్‌తో పాటు పలుగ్రామాల సర్పంచ్‌లు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు గ్రామసభల్లో తీర్మానాలు చేశామని, అయితే అధికారులు ఈ తీర్మానాలను పక్కన పెట్టి, తీర్మానం చేయని పనులను కూటమి నాయకులతో చేయిస్తున్నారని వివరించారు. తీర్మానాలను పక్కన పెట్టి, సర్పంచ్‌లతో కాకుండా కూటమి నాయకులతో పనులు చేయి స్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మజ్జి అప్పలనాయుడు,సిరిపురపు శంకరరావు పాల్గొన్నారు. – దత్తిరాజేరు

● క్షయపై అవగాహన



క్షయ రహిత భారత్‌ను తయారు చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని వైద్యాధికారులు హారిక, లావణ్య అన్నారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్ర మంలో భాగంగా కొట్టాం పీహెచ్ సీ పరిధిలోని గోపాలపల్లిలో ప్రజలకు బుధవారం అవగాహన కల్పించారు.అలాగే టీబీ సూపర్‌వైజర్ బి.శ్రీనివాస్ పలువురికి కఫం పరీక్షలు చేశారు. దగ్గు, కఫం, జ్వరం, బరువు తగ్గిపోవడం, ఆకలి మందగించడం, ఆయాసం, కఫంలో రక్తపు జీరలు కనిపించడం వంటి లక్షణాలు ఉన్నవారు, బీఎంఐ 18.5 కన్నా తక్కువగా ఉన్నవారు, మధుమేహరోగులు, పొగాకు అలవాటు ఉన్నవారు, హెచ్‌ఐవీ పాజిటివ్ ఉన్నవారికి టీబీ పరిక్షలు చేస్తున్నామని వైద్యాధికారులు తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. – శృంగవరపుకోట

● సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ



సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై కొత్తవలస మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులకు రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ తరగతులు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రమణయ్య ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల సమగ్రాభివృద్ధి, ప్రజారోగ్యం, పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, రక్షిత తాగునీరు సరఫరా,బాలల వికాసం, తదితర అంశాలపై స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి పెట్టాలన్నారు. అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయించాలన్నారు.ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ పాల్గొన్నారు. – కొత్తవలస